క్లుప్తంగా

అంబేడ్కర్ భవనం ప్రారంభం



మాట్లాడుతున్న కుళ్లాయప్ప

ధర్మవరం రూరల్: గొట్లూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనాన్ని ఆదివారం ఎస్సీ జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసగానపల్లి కుళ్లాయప్ప ప్రారంభించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన యువకులు దాతల సహకారంతో భవనాన్ని నిర్మించారు. ఈసందర్భంగా దాసగానపల్లి కుళ్లాయప్ప మాట్లాడుతూ మాదిగల శ్రేయస్సు కోసం తన శక్తి మేర కృషి చేస్తానన్నారు.

వైద్య విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు చెక్కులు అందిస్తున్న దృశ్యం

నల్లచెరువు: హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలేపల్లి తండాకు చెందిన వైద్య విద్యార్థులు ఆర్థికసాయం అందించారు. తండాకు చెందిన వైద్య విద్యార్థులు బుక్యా మౌనిక, బుక్యా అఖిల్ ఆర్థిక సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవికుమార్ దాత బ్రహ్మానందరెడ్డి సహకారంతో విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున అందజేశారు. విద్యార్థులు కోర్సు పూర్తి చేసే వరకూ సాయం అందిస్తామని రవికుమార్ తెలిపారు.

ఎస్ఐ బాలకృష్ణకు సత్కారం



బాలకృష్ణను సన్మానిస్తున్న అధికారులు

కదిరి టౌన్: కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐగా పనిచేస్తూ ఎస్ఐగా పదోన్నతి పొందిన సి.బాలకృష్ణను ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో జె.శివనారాయణస్వామి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎస్ఐ బాలకృష్ణ సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం ఆయన్ను పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. సీఐలు వి.నారాయణరెడ్డి, నిరంజన్‌రెడ్డి, నాగేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఆ రోడ్డుపై ప్రయాణం నరకమే!



అధ్వానంగా శీతారాంపల్లి రహదారి

ధర్మవరం రూరల్: మండలంలోని సీతారాంపల్లి రహదారి గుంతలు పడి రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ధర్మవరం నుంచి రేగాటిపల్లి మీదుగా 44వ నంబర్ జాతీయ రహదారికి వెళ్లే ఈ రహదారిపై నిత్యం వందల కొద్దీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రహదారి అధ్వానంగా ఉండడంతో వాహనాలు దడదడమంటూ పెద్ద శబ్దాలు చేసుకొని వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. గుంతలు పడ్డ రహదారిపై ప్రయాణం చేయాలంటే ఒళ్లు నొప్పులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని కోరుతున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రాన్ని అసాంఘికం చేశారు

- దీనిపై లక్ష మందితో పోస్టు కార్డు ఉద్యమం
- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



బుక్కపట్నంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



కొత్తచెరువులో పోస్టర్లు విడుదల చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం పుట్టపర్తిని పేకాటకు నిలయంగా మార్చి వేసిందని, ప్రశాంత నిలయానికి కూతవేటు దూరంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, దీనికి వ్యతిరేకంగా లక్ష మందితో పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపడతామని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం బుక్కపట్నం షాదీఖానా, కొత్తచెరువు ఎస్ఎల్‌వీ ఫంక్షన హాల్‌లో మండల కన్వీనర్లు కొత్తకోట కేశప్ప,శ్యామ్ సుందర్‌రెడ్డి అధ్యక్షతన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయి బాబా నడయాడిన పవిత్ర స్థలం, ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో గ్యాంబ్లింగ్‌తో యువతను దోచుకుంటున్నారన్నారు. ఇదంతా కూటమి ప్రభుత్వం కనుసన్నలో జరగడం దారుణమన్నారు. దీన్ని పోస్టుల కార్డుల ద్వారా ప్రధాని, రాష్ట్రపతి దృష్టికి తీసుకెళతామన్నారు. జగనన్న పాలనలో ఐదేళ్లు ప్రజలు సంతోషంగా జీవించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై పన్నులు, విద్యుత్ చార్జీలతో భారం మోపారన్నారు. సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను దారుణంగా వంచించారన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు, అక్రమ కేసులు..

కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పులు, అరాచకాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి రెడ్‌బుక్ పేరుతో అక్రమ కేసులు బనాయించడంతోపాటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీలోని బీసీ, ఎస్టీ నేతలపై నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, 307 సెక్షన్‌ల కింద కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. కొత్తచెరువులో ఏకంగా 14 మందిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా ఆస్తుల ధ్వంసంతో పాటు రైతులుగా ఎంతో కష్టపడి పెంచుకున్న మామిడి, చీనీ చెట్లను టీడీపీ మద్దతుదారులు తెగ నరుకుతున్నారన్నారు. మాజీ మంత్రి ఇలాంటి వాటిని నివారించాలని మాజీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శర వేగంగా అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పుట్టపర్తిని జిల్లా కేంద్రం చేయటంతో పాటు వేల జగనన్న ఇళ్లు కట్టించామని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట గుర్తు చేశారు. రెండు జాతీయ రహదారులు, ఒక గ్రీన్‌ఫీల్డు హైవే పనులు చేపట్టామన్నారు. వీటి ద్వారా పరిశ్రమలు అవంతకవే వస్తాయన్నారు. దీంతో పాటు రూ.864 కోట్లతో నియోజకవర్గంలో 193 చెరువులు నింపే పనులకు శ్రీకారం చుట్టామన్నారు. వాటి పనులను ప్రస్తుత కూటమి ప్రభుత్వం త్వరిత గతిన పూర్తి చేయాలని శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

సూపర్‌సిక్స్ పేరుతో పంగనామాలు..

సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలకు పంగనామాలు పెట్టారని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట విమర్శించారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్ అమలు చేయలేదన్నారు. ఇక తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంలోనూ ప్రజలను వంచించారని విమర్శించారు. వీటిపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బుక్కపటానికి చెందిన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు నాగలక్ష్మి, గోవిందరెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ గోవర్దన్‌రెడ్డి, నియోజకవర్గ గ్రీవెన్సు సెల్ అధ్యక్షుడు విజయారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు మల్లేశ్, బీసీ,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఎల్ ఐసీ చంద్ర, నీలూరి ఈశ్వర్, మైనార్టీ కన్వీనర్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు పుష్ప, రఫీ, మండల బూత్ లెవల్ కన్వీనర్ పతంజలి, తల్లం మల్లికార్జున,నాగభూషణ పాల్గొన్నారు. కొత్తచెరువులో జరిగిన కార్యక్రమంలో తలమర్ల సొసైటీ మాజీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి సోమశేఖర్‌రెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు, నారాయణ,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు,మహిళా విభాగం మండల అధ్యక్షురాలు ప్రభావతమ్మ,మైనార్టీ మండల అధ్యక్షుడు రఫీ,బీసీ సెల మండల కమిటీ అధ్యక్షుడు వడ్డే భాస్కర్, డాక్టర్ల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు హనుమంతరెడ్డి, నాయకులు ఎల్లప్ప, పాదయాత్ర శంకర్, వెంకట్రాముడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాబు మోసాలను ఇంటింటికీ తీసుకెళ్దాం



కోటపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తనకల్లు: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను గ్రామాలలో ఇంటింటికి తీసుకెళ్దామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోటపల్లిలో ఆదివారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇష్టారాజ్యంగా హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలందరినీ నట్టేట ముంచారన్నారు. సూపర్‌సిక్స్ హామీల పేరుతో అన్ని వర్గాల ప్రజలను వంచన చేసిన ఘనత బాబుకే చెందుతుందన్నారు. ఇలా ఎన్నో రకాల వాగ్దానాలు ఇచ్చిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను విడుదల చేశారు. సర్పంచ్ రామచంద్రారెడ్డి, మండల కమిటీ సభ్యులు ముస్తఫా, నరేంద్ర, రెడ్డి పీరా, సూరి, బయారెడ్డి, రమణారెడ్డి, నాయకులు రెడ్డెప్పరెడ్డి, రమణ, నారాయణరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, షామీర్‌బాషా, అబ్దుల్, మహమ్మద్ ఇక్బాల్, రమణారెడ్డి, కొండయ్య, సానే రమణ, లక్ష్మీపతి, నరేష్ తదిదరులు పాల్గొన్నారు.

కొత్తచెరువులో అక్రమ కట్టడాల తొలగింపు



జేసీబీతో భవనాన్ని తొలగిస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: కొత్తచెరువులో ప్రధాన రోడ్డుపై అక్రమ నిర్మాణాలను ఆదివారం తొలగించారు. ప్రధాన రోడ్డుపై ఇటీవల పలు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో రోడ్డుకు అడ్డంగా నిర్మించిన కట్టడాలను తొలగించుకోవాలని భవనాల యజమానులకు అధికారులు సూచించారు. సుమారు రెండు నెలలు గడువు ఇచ్చినా సంబంధిత యజమానులు కట్టడాలను తొలగించకపోవడంతో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ దగ్గరుండి కట్టడాలను తొలగింపజేశారు. దీంతో కొద్దిసేపు భవనాల యజమానులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. స్థానిక పోలీసుల సహాయంతో షాపుల ముందు భాగంలో ఉన్న మెటీరియల్‌ను తొలగించారు. .

నిత్యం ట్రాఫిక్ సమస్య..

దర్మవరం–గోరంట్ల, పెనుకొండ–బుక్కపట్నం ప్రధాన రహదారుల్లో వందలాదిగా షాపులు ఏర్పాటు చేసుకొని ప్రధాన రోడ్డుపైకి చొచ్చుకొచ్చారు. వీటితో పాటు ప్రధాన రహదారులపై విగ్రహాలు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుట్టపర్తి జిల్లా కేంద్రం కావడంతో వాహనాల రద్దీ పెరగడం, ఆర్టీసీ బస్సుల సంఖ్య పెరగడంతో నెహ్రూ సర్కిల్ వద్ద తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే సర్కిల్ లోనే ఆటోలు నిలిపి ఉండడంతో మరింత ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికే మార్కింగ్ ఇచ్చిన ప్రకారం భవనాలను తొలగించుకోవాలని ఆర్డీఓ సూచించారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



అమీన్‌నగర్‌లో గుడిసెలు వేసుకున్న పేదలు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని న్యూ అమీన్ నగర్‌లో ఉన్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సైదాపురం పొలం సర్వే నంబర్ 294 ప్రభుత్వ భూమిలో సీపీఎం ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకున్నారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ గత 5 నెలల నుంచి ఇళ్ల స్థలాలు కేటాయించాలని సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయం, పుట్టపర్తి కలెక్టరెట్ వద్ద ఆందోళనలు నిర్వహించామన్నారు. అయినా రెవెన్యూ అధికారులు దరఖాస్తులు విచారణ కూడా చేయలేదన్నారు. రోజు వారి కూలీ డబ్బుతో కుటుంబాలను పోషించుకోవడమే భారంగా ఉందన్నారు. ఇంటి అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న పేదలకు పాత, కొత్త అమీన్‌నగర్ పరిధిలోని 294 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జీఎల్.నరసింహులు, ప్రాంతీయ కార్యదర్శి జగన్మోహన్, నాయకులు బాబ్జాన్, సాంబశివ, ముస్తక్, రాంమోహన్, శాంతిబాయి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



విజేతకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం అలవడుతుందని ప్రతి ఒక్కరూ రోజూ యోగా సాధన చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్ రెడ్డి సూచించారు. పట్టణంలోని బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి యోగాసన స్పోర్ట్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా పరిసర ప్రాంతాల నుంచి వివిధ కేటగిరిలో యోగాసన పోటీలకు విద్యార్థులు హాజరయ్యారు. యోగాసనాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, గిర్రాజు నగేష్, ఓబిలేసు, మున్సిపల్ ప్రాజెక్టు ఆఫీసర్ విజయభాస్కర్, సత్రసాల ప్రసన్నకుమార్, రాజశేఖర్ రెడ్డి, సుబ్బరాయుడు, యోగా మాస్టర్లు సాకే ఈశ్వరయ్య, తిరుమలేసు, వెంకట లక్ష్మయ్య, కట్టా రవికుమార్, దాసరి శ్రీనివాసులు, పులిచెర్ల రవీంద్ర, ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆనందం, ఆరోగ్యం

బత్తలపల్లి: ధ్యానంతో ఆనందం, ఆరోగ్యం, తృప్తి కలుగుతుందని ధర్మవరం సీనియర్ పిరమిడ్ గ్రేట్ మాస్టర్లు సుబ్బారత్నమ్మ, కృష్ణమూర్తి దంపతులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీహరి హర పిరమిడ్ ధ్యాన మందిరంలో ఆదివారం ఆనందం కార్యక్రమంలో భాగంగా సజ్జన సాంగత్యం తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా వారు ధ్యానం ప్రాధాన్యతను తెలియజేశారు. సీనియర్ పిరమిడ్ గ్రేట్ మాస్టర్లు కొండన్న, నాగేంద్ర, గోపాల్, యశోదతోపాటు 70 మంది ధ్యానులు హాజరయ్యారు. రామాపురం కప్పల కొండప్ప పేరు మీదుగా వారి భార్య కప్పల లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

మెగా వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తలుపుల : మండల కేంద్రం ఓబీఆర్ రోడ్డులో గల ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఎంపీపీ ఎస్.రఫినాయక్ ఆధ్వర్యంలో సన్ రే ఆసుపత్రి(అనంతపురం) సహకారంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. న్యూరాలజీ వైద్యుడు డా.రామమోహన్, కిడ్నీ వైద్యుడు డా.సురేంద్ర బాబు, ఫిజీషియన్ డా. దనుంజయ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా 320 మంది కి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ సన్‌రే ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఓఓ విశ్వనాథరెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

లేపాక్షి: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని హిందూపురం డీఎస్పీ కేవీ మహేష్ సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. వినాయక చవితి పండుగ నేపథ్యంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ జనార్దన్, ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ'

గాండ్లపెంట: జీడిమేకలపల్లి, తుమ్మలబైలు పెద్దతండా, తుమ్మలబైలు, గొల్లపల్లిలో సోమవారం వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆ పార్టీ మండల కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, పార్టీ వివిధ అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు పెడపల్లిలో...

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం పెడపల్లిలో సోమవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పుట్టపర్తి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఉదయం 8.30 గంటలకు ఎంపీపీ ఏవీ రమణారెడ్డి ఇంటి వద్దకు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున రావాలని కోరారు.

నేడు రెడ్డిపల్లిలో..

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లిలో సోమవారం ఉదయం 10–30 గంటలకు 'బాబు షూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా మండలస్థాయిలో జరిగే కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో ఇవ్వాలని కోరారు.

'ఉపాధి' పనుల్లో అవినీతిని నిగ్గు తేల్చండి

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనుల్లో కూటమి నాయకుల అండతో అవినీతి జరుగుతోందని, దీన్ని నిగ్గు తేల్చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఉపాధి కూలీల కడుపు కొడుతూ డబ్బులు దండుకొంటున్నారని ఆరోపించారు. తక్షణమే జిల్లా వ్యాప్తంగా విచారణ జరిపి నిధులు దుర్వినియోగం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేదలకు కంటి చూపును ప్రసాదించడమే లక్ష్యం



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పేద ప్రజలకు కంటి చూపును అందించడమే తమ లక్ష్యమని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి నాగేంద్ర, ట్రెజరర్ వెంకటేష్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పల్లెం నాగమ్మ, శ్రీనివాసులు కుమారుడు పల్లెం వేణుగోపాల్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 73 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 54 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. లెక్చరర్ శ్రీనివాసరెడ్డి, లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకుడు పిట్టా వెంకటస్వామి, సభ్యులు మోహన్‌దాస్, రాధాకృష్ణ, ఎం.వేణుగోపాలాచార్యులు, మెటికల కుళ్లాయప్ప, ఎం.కృష్ణ, పుట్లూరు నరసింహులు, రాజగోపాల్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు లేక మూత బడిన దేవిరెడ్డి పల్లి ప్రభుత్వ పాఠశాల



పెద్దయల్లంపల్లిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల

ప్రవేశాల్లో వెనుకబడి

- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- పలు గ్రామాల్లో మూత బడిన పాఠశాలలు
- ప్రైవేటు స్కూళ్లపై ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు

నల్లచెరువు: మండలంలో విద్యాశాఖ నిద్రావస్థలో కొట్టుమిట్టాడుతోంది. విద్యా వ్యవస్థను పటిష్టం చేశామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పకుంటున్నా స్థానికంగా పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాఠశాలల్లో సమస్యలు తిష్ట వేశాయి. తల్లిదండ్రులను చైతన్య పరిచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు చేపడుతున్న చర్యలు నామమాత్రంగా సాగుతున్నాయి. దీంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వీడి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లిపోతున్నారు.

ప్రవేశాలు అంతంతే...

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతోంది. నల్లచెరువు మండలంలో 53 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలో 2449 మంది విద్యార్థులు ఉండగా ఈ సంవత్సరం 2187 మంది విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నట్లు సమాచారం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2023–24 సంవత్సరంలో మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 3 వేల మంది వరకూ విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. పై గణాంకాలు చూస్తే క్రమేణా విద్యార్థులు సంఖ్య తగ్గుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ ఏడాది ప్రవేశాల పెంపునకు అధికారులు చేపట్టిన చర్యలు నామమాత్రంగా సాగినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టించుకునేవారేరీ?

మండలంలో ఇద్దరు ఎంఈఓలు ఉన్నా ఎప్పటికప్పుడు పాఠశాల పనితీరుతు పర్యవేక్షించి నివేదికలను జిల్లా విద్యాశాఖ అధికారులకు అందజేయాల్సి ఉంది. మండలంలో ఇలాంటి పరిస్థితులు లేవనే విమర్శలున్నాయి. విద్యా ప్రమాణాలు తగ్గిపోవడానికి అధికారుల పర్యవేక్షణ లేపం ప్రధాన కారణమని విద్యార్థుల తల్లి దండ్రులు వాపోతున్నారు.

పలు గ్రామాల్లో విద్యార్థులు లేక..

మండలంలోని గోరంట్లవారిపల్లి, తిరుమలదేవరపల్లి, దేవిరెడ్డిపల్లి, పెద్దయల్లంపల్లి, గోరంట్లవారిపల్లి, తెల్లగుట్లపల్లి గ్రామాల్లో ఈ ఏడాది ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. ఉన్న విద్యార్థులు టీసీలు తీసుకుని ప్రైవేటు పాఠశాలల్లో చేరారు. ఎందుకని అడిగితే ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, టాయిలెట్లు, వంటి మౌలిక వసతులు కూడా లేవంటున్నారు. దీంతో ప్రభుత్వబడులు మూతపడే స్థితికి చేరుకున్నాయి.

అవగాహన కల్పించాం

విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు మండంలోని ప్రతి గ్రామానికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. మరోసారి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి సంఖ్యను పెంచే ప్రయత్నం చేస్తాం.

– తిరుపాల్‌నాయక్, ఎంఈఓ, నల్లచెరువు, మండలం

సీపీఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి



తాడిమర్రిలో ఇంటింటా భిక్షాటన చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

తాడిమర్రి: ధర్మవరంలో ఈనెల 31 నుంచి జరిగే సీపీఐ శ్రీసత్యసాయి జిల్లా రెండో మహాసభలు జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ బీసాని లక్ష్మీనారాయణ కోరారు. స్థానిక ఎస్సీ కాలనీలో ఆదివారం ఆయన సీపీఐ మండల నాయకులు, కార్యకర్తలతో కలసి భిక్షటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ 1925 డిసెంబర్ 26న కాన్పూరులో స్థాపించబడిందన్నారు. అప్పటి నుంచి నేటి వరకు పేదల పక్షాన నిలబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాటాలు చేసిన ఏకైక పార్టీ అని వారు కొనియాడారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు, కార్యకర్తలు చిన్నదాస్, వన్నూరప్ప, బీసాని పోతలయ్య, గురప సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ధర్మవరం రూరల్: దర్శనమల గ్రామ సమీపంలో ఆదివారం పేకాటశిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.6,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.